

## మహేశ్ శెట్టికి హైకోర్టులో ఊరట

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదం సూత్రధారి మహేశ్‌శెట్టి తిమరూడికి హైకోర్టులో ఊరట లభించింది. సిట్ అధికారులు దాడులు విచారణకు నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరు కాకపోవడంతో జిల్లా యంత్రాంగం దక్షిణకన్నడనుంచి బహిష్కరిస్తూ నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. అయతే మహేశ్‌శెట్టి హైకోర్టును ఆశ్రయించగా అక్టోబరు 8వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎనిమిదిరోజులపాటు ఆయనకు ఊరట లభించిందనట్లయ్యింది.



అంబారీపై ఊరేగుతున్న దుర్గా పరమేశ్వరి

## వైభవంగా దుర్గాష్టమి

● అంబారీపై ఊరేగిన దుర్గా పరమేశ్వరి 7

## కరుణించమ్మా.. కనకదుర్గా

● దుర్గాష్టమి సందర్భంగా పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



కద్రిపురలో మహాలక్ష్మికి విశేష అలంకరణ

దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు రూపాల్లో అమ్మవారు దర్శనమిచ్చింది. బుధవారం ఆయుధ పూజ సందర్భంగా పూలు, పండ్లు కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.



దుర్గాదేవిగా చామరాజుపేట వాసవీమాత



శాకంబరిగా ముత్యాలమ్మదేవి



వజ్రాంగి అలంకరణలో విద్యారణ్యపుర కాళికాదుర్గ





ఏరియల్ సర్వేలో సీఎం సిద్దరామయ్య

# కన్నీరు..!

● ఉత్తర కర్ణాటకను ముంచెత్తిన వరదలు
● నీట మునిగిన పంట పొలాలు
● అతివృష్టితో 10 జిల్లాలు అతలాకుతలం
● 7 లక్షల హెక్టార్లకుపైగా జలమయం
● భారీ నష్టంతో అన్నదాత విలవిల
● ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే



బీదర్ జిల్లా హులసూరు తాలూకా కొంగలి గ్రామం వద్ద మంజీరా నది వరదతో నీట మునిగిన పంటపొలాలు



### నీట మునిగిన పంటల వివరాలు

| పంటపేరు | హెక్టార్లలో |
|---|---|
| మొక్కజొన్న | 92,482.01 |
| వరి | 480.39 |
| జొన్న | 74.07 |
| రాగి | 8.36 |
| సజ్జ | 4262.86 |
| సిరిధాన్యాలు | 0.20 |
| కంది | 1,78,173 |
| ఉద్దులు | 34,731 |
| పెసలు | 2,47,712 |
| వేరుశెనగ | 2143.03 |
| సూర్యకాంతి | 2119.89 |
| సోయాబీన్ | 39,749 |
| పత్తి | 49,285.88 |
| చెరుకు | 13,239.60 |
| పొగాకు | 3.20 |
| మొత్తం | 6,64,469.80 |



నీట మునిగిన పంటలు

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక రైతులకు కన్నీరే మిగిలింది. అతివృష్టి సాగుపొలాలను అతలాకుతలం చేసింది. జిల్లాకు ఎగువ భాగాన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడం, అదే స్థాయిలో ఉత్తర లోనూ వానలు తోడవ్వడంతో ఏకంగా 10 జిల్లాల్లో దాదాపు ఆరేడు రోజులుగా జనజీవనం స్తంభించింది. సుమారు 7 లక్షల హెక్టార్లలో పైగా పంట నీట మునిగింది. దీంతో ఈ ఏడాది రాష్ట్రంలో పంట దిగుబడులకు భారీ నష్టం వాటిల్లింది. లక్షలాది మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తులు తగ్గుముఖం పట్టడం భవిష్యత్తులో భయాందోళన కలిగించే అంశంగా మారింది. ఉత్తర కర్ణాటక జిల్లాల్లోని గదగ్, బాగల్కోట, విజయపుర, చిత్రదుర్గ, దావణగెరె, బీదర్, హావేరి, కలబురగి, కొప్పళ, బెళగావితోపాటు పలు జిల్లాల్లో పంటనష్టం జరిగింది. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో కృష్ణ నదికి అనుబంధమైన జలాశయాల ద్వారా పలు పంటలు సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో ఉద్దులు, పెసలు, వరి, సూర్యకాంతి, పత్తి, కంది పంటలు విస్తారంగా సాగు చేస్తారు. దాదాపు ఈ పంటలు పూర్తిగా నీట మునిగాయి.

ఈ ఏడాది ఖరీఫ్ పంటకాలానికి నెలరోజుల ముందే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ ప్రభావంతో సీజన్‌కు ముందే దక్షిణ కర్ణాటక వ్యాప్తంగా విత్తనపనులు సాగాయి. అయితే మొలకల తర్వాత వర్షం జాప్యం కావడంతో పంట సకాలంలో పైర్లు రాలేదు. ఈ ప్రభావం కూడా పంట దిగుబడుల ఉత్పత్తులపై ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో 85.21 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు లక్ష్యంగా ఉండేది. 148.48 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార పదార్థాల ఉత్పాదన లక్ష్యంగా ఉండేది. ఖరీఫ్‌లో 55.87 లక్షల హెక్టార్లలో విత్తనపనులు సాగగా 109.23 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు దిగుబడి లక్ష్యంగా ఉండేది. సకాలంలో వర్షాలు కురవక కొంత మేర నష్టంతోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాల్లో భారీ వర్షాల ద్వారా పంటనష్టం జరిగింది. సాధారణంగా ఖరీఫ్‌లో 110-112 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల లక్ష్యంపైకి ఈ ఏడాది 109 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంగా ఉంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో పెను నష్టానికి కారణమవుతోంది.

### అధిక వర్షపాతం

సాధారణంగా సెప్టెంబరు చివరినాటికి 821 మిమీ వర్షపాతం కురవాల్సి ఉండేది. ఈ ఏడాది సాధారణం కంటే 2శాతం ఎక్కువ వర్షం కురిసింది. బెంగళూరు దక్షిణ (రామనగర), చామరాజనగర, చిత్రదుర్గ, మైసూరు, బళ్లారి, జిల్లాల్లో అవసరమైనంత మేర వర్షం కురవలేదు. కోలారు, చిక్కబళ్లాపుర, తుమకూరు తదితర జిల్లాల్లో విత్తన పనులు జరిగిన తర్వాత వర్షాలు అనుకూలం కాలేదు. ఇలా పలు కారణాలతో ఖరీఫ్ సీజన్‌లో పంటనష్టం వాటిల్లింది. తద్వారా ఆహార ధాన్యాల దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. గత ఏడాది 2024-25లో 83.97లక్షల హెక్టార్లలో విత్తనపనులు సాగగా 151.57 లక్షలమెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధ్యమైంది. అయితే ఈ ఏడాది 2లక్షల హెక్టార్ల విస్తీర్ణం గత ఏడాదికంటే పెరిగినా వర్షాలతోపాటు పలు కారణాలతో భారీగా ఆహార ధాన్యాల దిగుబడి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. అయితే రాష్ట్రంలోని అన్ని జలాశయాలు మూడు నెలలుగా నిండుకుండలా ఉండడం, చెరువులు, కుంటలు, కాలువలు నీరు నిరంతరంగా నిల్వ ఉండడంతో రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో వారం రోజులుగా భారీ వర్షాలకు పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. భీమా నది పరీవాహకంలో పల్లెలు సైతం నదిగా మారిపోయాయి. రెండురోజుల కిందటి నాటికి రాష్ట్ర రెవెన్యూశాఖ అంచనాల ప్రకారం 6.64 లక్షల హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. తాజాగా రెండు రోజులతో కలిపితే 8 లక్షల హెక్టార్లు దాటే అవకాశం ఉన్నట్టు అంచనా.

### స్పందించిన ముఖ్యమంత్రి

ఉత్తర కర్ణాటక జిల్లాల్లో భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏరియల్ సర్వే జరిపారు. మంగళవారం బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన ఆయన కలబురగి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ వివిధ జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు ఎంబీ పాటిల్, ప్రియాంకఖర్గే, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడతో కలసి ఏరియల్ సర్వే జరిపారు. కలబురగి, విజయపుర, యాదగిరి, బీదర్ జిల్లాల పరిధిలో ఆయన నీట మునిగిన పంటలను పరిశీలించారు. అత్యవసర చర్యలపై సీఎం సిద్దరామయ్య వరదపీడిత జిల్లాధికారులు, జడ్పీ సీఈఓలతో సమీక్ష జరిపారు. వీలయినంత త్వరగా నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలన్నారు.





అంబారీ లేకుండా గజరాజుతో రిహార్సల్స్ చేస్తున్న మావటీలు

## జంబూసవారీకి సిద్ధమైన రాచనగరి

### పర్యాటకులతో కళకళలాడుతున్న మైసూరు

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రతిష్టాత్మకమైన జంబూసవారికి రాచనగరి సిద్ధమవుతోంది. గురువారం మధ్యాహ్నం జంబూసవారి వేడుకలు జరగనున్నాయి. వందలాది కళాబృందాలు, అశ్వదళం సాగుతుండగా గజరాజుల ఊరేగింపు జంబూసవారిలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. 750 కేజీల బంగారు అంబారీపై నాడదేవత చాముండేశ్వరిదేవిని ప్రతిష్టించి గజరాజుపై ఊరేగింపు చూసేందుకు లక్షలాదిమంది రానున్నారు. మైసూరు జిల్లా యంత్రాంగం వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం కూడా రిహార్సల్స్ జరిగాయి. కాగా మైసూరు ప్యాలెస్ మీదుగా సాగే జంబూసవారి యాత్రలో పాల్గొనేవారికి ప్రత్యేకమైన పాస్‌లను మంజూరు చేశారు. గతంలో చోటు చేసుకున్న కొన్ని పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా వేలాదిమందితో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

దసరా ఉత్సవాలు సెప్టెంబరు 22న ప్రారంభం కాగా అప్పటి నుంచే మైసూరుకు కొత్త శోభ వచ్చింది. ప్రతినిత్యం కళాబృందాల ప్రదర్శనలు, వస్తు ప్రదర్శనశాలతోపాటు వివిధ వేదికల ద్వారా సాంస్కృతిక, సాహిత్యగోష్టులు నిరంతరంగా సాగాయి. నాట్య ప్రదర్శనలు కొనసాగాయి. వైమానిక ప్రదర్శనలు మైసూరు ప్రజలను అలరించాయి. ప్రతిరోజూ సాయంత్రం మైసూరు వీధులలో కిలోమీటర్ల ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేకంగా ఉంది. అందుకు అనుబంధంగా డ్రోన్ షో మరింత ఉత్సాహం నింపింది. ఆకాశంలో వివిధ దేవతల రూపాలతోపాటు పలు ప్రత్యేకమైన బొమ్మల వెలుగులు జిగేల్ మనిపించాయి. డ్రోన్‌షోలో భాగంగా 3వేల డ్రోన్‌లతో జాతీయజంతువు పులి నమూనాకు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు (మిగతా 7వ పేజీలో..)



అలంకరణలో ఏళుమక్కల తాయి అమ్మవారు



లలితా పరమేశ్వరి



పేటె ఆంజనేయస్వామి



ఖర్జూర పండ్ల అలంకరణలో ఎర్రితాత



దుర్గాదేవిగా తాయమ్మదేవి



గాజుల అలంకరణలో బెంకి మారెమ్మ

# భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి

బళ్లారి/సిటీ/కంప్లి/సిరుగుప్ప, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తోంది. బళ్లారి నగరలో భక్తుల కొంగబంగారంగా కొలుస్తున్న ఏళుమక్కలతాయి దేవాలయం, ఎల్లెల్సీ కాలనీలో వెలసిన లలితా పరమేశ్వరిదేవాలయంలో అమ్మవార్లు వివిధ రూపాల్లో వెలిశారు. ఏళుమక్కల తాయి ఆలయంలో హోమం. దేవికి విశేఖ పూజలు చేశారు. అలాగే ఎల్లెల్సీ కాలనీలో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లు అనేక రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఎల్లెల్సీ విశ్రాంతి ఇ.ఇ. సురేష్‌రెడ్డి దంపతులు, అలాగే ఎల్లెల్సీలో ఇంజనీర్లు పాల్గొన్నారు.

● కంప్లి పట్టణంలో కాకతీయ నగర్‌లో వెలిసిన గౌర సముద్రం మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి యేటా నవరాత్రులు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను సమర్పించుకుంటారని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, అమృతాభిషేకం, ఆకు పూజలు, కుంకుమార్చన తదితరులు పూజలు నిర్వహించారు.

● సిరుగుప్ప తాలూకాలో దుర్గాష్టమి వేడుకలు కనుల పండువగా జరుపుకుంటున్నారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో తాయమ్మదేవికి దుర్గాష్టమి సందర్భంగా దేవికి దుర్గాదేవిగా అలంకార సేవలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు, ప్రవీణ్‌లు కుంకుమార్చన, ఆకులపూజ, వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జగన్మోహన్‌రావ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.



నీటిని విడుదల చేస్తున్న మంత్రి శివరాజ్ తంగడి

## రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఉలేనూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి శివరాజ్ తంగడి

కంప్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శివరాజ్ తంగడి సూచించారు. మంగళవారం ఉలేనూరు ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ప్రారంభించారు. కనకగిరి నియోజకవర్గ పరిధి లోని ఎలిగనూరు, ఎలిగనూరు క్యాంపు, బడుగుంప, హలసాడు, తిమ్మాపూర్, నందిహళ్లి, కక్కర్‌గోళ్, శాలిగనూరు, బెన్నూరు గ్రామాల చివరి భాగం (31వ ఉప కాలువ)రైతులకు సాగుకు నీరందించే ఎత్తిపోతల పథకం ద్వారా ఉలేనూరు నుండి లిఫ్ట్ చేపట్టామన్నారు. రూ. 62.61 కోట్ల వ్యయంతో నిర్మించబడిన ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 15,605 ఎకరాల భూమికి నీరు సాధ్యం అవుతుందన్నారు.



బెన్నూరు గ్రామం వద్దకు చేరుకున్న నీరు

# కులగణన వేగవంతం చేయాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక విద్యా పనుల్లో గుర్తించిన 3.85లక్షల ఇళ్లలో 1.45 లక్షల ఇళ్ల సర్వే పూర్తయిందని, ఇప్పటివరకు 38శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో 15వ స్థానంలో ఉన్నామని, సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లాకలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాన్ వీడియో హాల్లో అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్వే ప్రారంభం అయి 8 రోజులు అయ్యిందని, మిగిలిన రోజుల్లో వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని కంప్లి, కురగోడు, సిరుగుప్ప తాలూకాల్లో సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. అధికారులు పరస్పర సహకారంతో పని చేయాలన్నారు. సండూర్ ప్రాంతంలోని 79 వేల ఇళ్లలో తోరణగల్లు, వడ్డు గ్రామాల్లో ఒక్కొక్కటి 10వేల ఇళ్లుఉండగా, వాటిలో తోరణగల్లులో జిందాల్ ప్రాంతంలో 6టౌన్‌షిప్‌లు ఉన్నాయి. ఇక్కడ సర్వే పనులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ.. సండూర్‌లోని తోరణగల్లు వడ్డు గ్రామాల్లో, రాష్ట్రం వెలుపల నుంచి 10 మందికిపైగా నివసిస్తున్నారన్నారు. అక్కడ ఒక వ్యక్తి ఆధార్ కార్డు సమాచారాన్ని పొందడం ద్వారా జనాభా గణన నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకూడదని ఆయన సండూర్ తాలూకా తహశిల్దార్‌ను ఆదేశించారు. బళ్లారినగర పరిధిలోని ప్రతి రెండు వార్డులకు ఒక జిల్లా స్థాయి అధికారిని సర్వే పనులను పర్యవేక్షించడానికి నోడల్ అధికారిగా నియమించినట్లు డిప్యూటీ కమిషనర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అయితే ఎటువంటి పురోగతి లేదని, అధికారులు జాగ్రత్తగా పనిచేయాలన్నారు. నగర పరిధిలో మొత్తం 171 మంది జనాభా లెక్కలు తీసుకునేవారు ఉన్నారని వీరిలో 36మంది మాత్రమే విధుల్లో ఉన్నారని మిగిలిన వారు స్పందించడం లేదని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అలాంటి వారిని గుర్తించి సస్పెన్షన్‌కు సిఫార్సు చేయాలన్నారు. సమావేశంలోఅదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోదు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప, డిఎంఎఫ్ ప్రత్యేక అధికారి లోకేష్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ మంజునాథ్, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్రప్రసాద్

## భార్యను చంపిన భర్త



లింగమ్మ మృతదేహం

కంప్లి/బళ్లారి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భార్య మీద అనుమానంతో భర్తే దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. శిరిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముద్దటనూరు గ్రామంలో లింగమ్మ (22) హత్యకు గురైంది. మడివాళ దేవరాజ్ సంతానం కలగలేదని నిత్యం గొడవ పడేవాడు. తరచూ భార్యను అనుమానించే వాడు. రాత్రంతా గొడవ పడిన దేవరాజ్ పడుకున్న భార్యపై కర్రతో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్పీ డాక్టర్ శోభారాణి, డీఎస్పీ సురేష్ చౌహాన్, సీఐ చందనగోపాల్, ఎస్ఐ శశిధర్, సద్దాం హుస్సేన్, ముద్దటనూరుకి వెళ్లి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. లింగమ్మ తండ్రి ఫిర్యాదు మేరకు శిరిగేరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



దేవరాజు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి



సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

## లెక్చరర్ల నియామకం హర్షణీయం: ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో అతిథి లెక్చరర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఏడీఎస్ఓ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వారు ప్రభుత్వ నిర్ణయంపై సంబరాలు జరుపుకున్నారు. రెండు నెలలుగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రతిఫలం దక్కిందన్నారు. నగరంలోని సరళాదేవి, సిటీ కళాశాలల్లో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈరన్న, కార్యాలయ కార్యదర్శి నిహారిక, విద్యార్థులు నరసింహ,నరేంద్ర, భీమన్న పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో రహదారికి మరమ్మతులు

● సేవే లక్ష్యం అంటున్న ఎస్ఐ తారాబాయి



పనులను పరిశీలిస్తున్న ఎస్ఐ తారాబాయి



బళ్లారిరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సొంత ఖర్చులతో రహదారులకు మర మ్మతులు ఆదర్శంగా నిలుస్తున్నా రా ఎస్ఐ. విజయనగరం జిల్లా మరమ్మనహళ్లి పోలీసు స్టేషన్ ఎస్ఐ తారాబాయి సేవే లక్ష్యంగా పలు గ్రామాల్లో గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నారు వాహనదారులు పడుతున్న ఇబ్బందులు గమనించి గోతులు పూడుస్తున్నారు. మంగళవారం మరమ్మనహళ్లి సర్కిల్ హరిహర నుంచి మరమ్మనహళ్లి తండా దేవలాపురం గేట్ వరకు పాడయిన రహదారులకు మరమ్మతులు చేయించారు. ఎస్ఐని గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## ఔషధాల వినియోగంపై అవగాహన తప్పనిసరి

● డీఎంహెచ్ఓ శంకర్‌నాయక్



హొస్పేట,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఔషదాల దుర్వినియోగాన్ని నివారించడానికి, ఔషదాల వాడకం గురించి అవగాహన కల్పించడానికి ఫార్మసిస్ట్ దినోత్సవం గొప్పమార్గమని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ ఎల్ఆర్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఫుడ్ సేఫ్టీఅండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ వేడుక, నిరంతర అభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.ఈ సంవత్సరం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్స సందేశం ఆరోగ్యం గురించి ఆలోచించండి వైద్యుల పాత్ర ఎంత ముఖ్యమో ఫార్మసిస్టుల పాత్ర కూడా అంతేముఖ్యమైనది. రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేయడంలో, వ్యాధిని యంత్రణలో ఫార్మసిస్టుల సేవ చిరస్మరణీయమైనదన్నారు. అసిస్టెంట్‌డ్రగ్ కంట్రోలర్ జీవీ నారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ అండ్‌కాస్మెటిక్స్ చట్టం 1940 మార్గదర్శకాల ప్రకారం పశు వైద్యమందులను విడిగా నిల్వ చేయాలని లేబుల్ చేయబడి గడువు ముగిసిన మందులను ఎట్టిపరిస్థితుల్లోను విక్రయించకూడదని అన్నారు. విద్యావంతులైన వ్యక్తులను మందుల దుకాణాలలో నియమించాలన్నారు.

### ఫార్మసిస్టుల సేవ ప్రత్యేకమైనది: కమిషనర్

ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా వైద్యులు సిఫార్సు చేసిన మందులను రోగులకు ఖచ్చితంగా అందించడం ద్వారా ఆరోగ్య సంరక్షణలో ముఖ్యమైన పాత్రపోషిస్తున్న ఫార్మసిస్టుల సేవ ప్రత్యేకమైనదని జిల్లా కమిషనర్ కవితా ఎస్ మన్నికెరి అన్నారు. మంగళవారం నగరంలోని శ్రీవదకరాయ ఆలయ సమీపంలో ఆహార భద్రత, ఔషద పరిపాలన విభాగం నిర్వహించిన ప్రపంచఫార్మసిస్టుల దినోత్సవ అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. ర్యాలీ యాత్రమొయిన్ బజార్, గాంధీ సర్కిల్, బస్టాండ్ మీదుగా డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి డాక్టర్ వినోద్, డ్రగ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా యూనిట్ గౌరవ అధ్యక్షుడు జనవరాజరెడ్డి, జిల్లా యూనిట్ అధ్యక్షుడు జె సంతోష్‌కుమార్, జిల్లాకార్యదర్శి మహిద్ తంబ్రహళ్లి, జిల్లా యూనిట్ అధికారులు రాజశేఖర్‌స్వామి పాల్గొన్నారు.

## కులగణన పూర్తి చేసిన అధికారులకు సన్మానం



సత్కారం పొందిన అధికారులు

సిరుగుప్ప, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన సర్వేను వేగంగా పూర్తి చేసిన అధికారులను మంగళవారం తహసీల్దార్ సమక్షంలో ఘనంగా సత్కరించారు. తాలుకాలో హనుమంత, మంజునాథ, నాగరాజు, జడయ్యస్వామి సర్వే పూర్తి చేసి అంజేశారు. ఈ నేపథ్యంలో సర్వే అధికారులు కులగణన సమక్షంలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈఓ పవన్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### మూడు రోజుల్లో సర్వే పూర్తి

రాయచూరు (ఆంధ్రజ్యోతి): వెనకబడిన తరగతుల కమీషన్ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, విద్య, ఆర్థిక సమీక్షను జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడొకరు రికార్డు టైమ్‌లో పూర్తి చేశారు. మూడు రోజుల్లోగా తనకు కేటాయించిన బ్లాక్‌లో 86 కుటుంబాల వివరాలను సేకరించి తహసీల్దార్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. కృష్ణమూర్తి కట్లాట్‌కూరు మోడల్ హయ్యర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. 25వ తేదీ నుంచి ఆయన మూడు రోజుల పాటు సర్వే పూర్తి చేసి సమగ్ర వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు.

# హోసూరు జోన్

## శాకంబరిగా దుర్గమ్మ



శాకంబరి అలంకరణలో అర్థనారీశ్వరుడు

హోసూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెరండపల్లిలోని శివశక్తినగర్ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన అర్ధనారీశ్వర ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా సాగాయి. మంగళవారం విశేష పూజల అనంతరం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవ దుర్గా యాగం నిర్వహించారు. 108 ముత్తైదువులు పాల్గొని లక్షార్చన నిర్వహించారు. తమిళనాడునుంచే కాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు

హోసూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ వర్షపునీటి పారుదల ప్రాజెక్టు అమలుపై షేర్‌హోల్డర్ల సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. 2025-26 ప్రకారం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, తాగునీటి సరఫరా శాఖ, నీటి వనరుల అనుసంధానంపై డ్రైనేజీ పనులను మూడుదశల్లో 1025 కోట్లు అంచనాగా వేశారు. మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య, కమిషనర్ షబ్బీర్ అలం పాల్గొన్నారు. తమిళనాడు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌తో సామాజిక సేవపై అవగాహన

హోసూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ద్వారా సామాజికసేవపై అవగాహన సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. హోసూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. శిబిరంలో సమాజసేవతోపాటు మహిళా విద్యాపథకం, ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాల గురించి వివరించారు. మహిళలకోసం చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఏంజెల్ ఆఫ్ జస్టిస్ రైట్ ఆఫ్ ఉమెన్ అనే పుస్తకాలను న్యాయవాది శ్వేతాశ్రీ పంపిణీ చేశారు. ఆరాధన ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




పుస్తకాలతో విద్యార్థులు

## గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డీహెచ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యం శ్రద్ధ వహించాలని, గర్భధారణ సమయంలో రక్తహీనతను నివారించడానికి పోషకాహారం, ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్ బాబు సూచించారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన పోషణ్ మాస వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పిల్లలకు టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వహించరా దన్నారు. కౌమారదశలో ఉన్న బాలికలు సకాలంలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లులు తమ పిల్లలకు 6నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వడం ప్రారంభించాలన్నారు. లేకుంటే పిల్లలు పోషకాహార అవసరాలను తీర్చడానికి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ,కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రతినెలా 3వ శనివారం జరిగే గ్రామ ఆరోగ్య పోషకాహార దినోత్సవం సందర్భంగా తమ ప్రాంతంలో లభించే కూరగాయల నుండి తయారు చేయగల పోషకమైన ఆహారాల గురించి తల్లులకు తెలియజేసి, ప్రదర్శించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈసందర్భంగా మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి, ప్రసూతి వైద్యురాలు విజయలక్ష్మి, డా.సింధు,ఖుర్షీద్ బేగం, వెంకటప్ప, హెల్త్ ఇన్‌స్పెక్టర్ బసవరాజ్ తో పాటు వివిధ సిబ్బంది అధికారులు, ఆశావర్కర్లు,తల్లులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి: కరవే




వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేస్తునన కరవే పదాధికారులు

కంప్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం డాక్టర్, నర్సు నిర్లక్ష్యంతో మృతి చెందిన చంద్రమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కంప్లి పట్టణంలో అంబేద్కర్ సర్కిల్లో కరునాడ రక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్య అధ్యక్షులు బి విరుపాక్షి యాదవ్ మాట్లాడుతూ కంప్లి ప్రభుత్వ సముదాయ ఆస్పత్రిలో గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ రవీంద్ర కనికేరి, నర్సు వల్ల ఎంతోమంది రోగులకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆశా కార్యకర్తలతో మొదలుకొని నర్సులు ఒకటై ప్రభుత్వాస్పత్రిలోని ప్రసవాలు అయ్యే గర్భిణీలకు ప్రభుత్వాస్పత్రిలో ఇబ్బందికరంగా ఏర్పడుతుంది. డాక్టర్ రవీంద్ర కనికేరి సొంత ప్రైవేటు ఆస్పత్రిలో మీకు అంత అనుకూలంగా చేపడతామని తెలిపేవారు. ఆశా కార్యకర్తల ద్వారా నర్సులు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులకు వారికి నచ్చజెప్పి డాక్టర్ రవీంద్ర కనికేరి తమ సొంత ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి డాక్టర్ ఇచ్చిన కాస్త డబ్బులు తీసుకునే వారు రోగులను వ్యాపారంగా మార్చుకున్నారని ఒక్క ప్రసవంకు రూ. 30 వేలు నుండి రూ. 50 వేలకు వసూలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ డాక్టర్‌గా వుండి ప్రైవేటు డాక్టర్‌గా కంప్లి పట్టణంలో చలామణి అయ్యేవారు ఎన్నో ఆదాయాలు పొందేవారు రామసాగరం చంద్రమ్మ విషయంలో కూడా ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో వుంచుకుని చివరకు రెండు ప్రాణాల్ని బలి తీసుకున్నారన్నారు. వీరితో పాటు మరికొందరు డాక్టర్లు కూడా ఇదే మాదిరిగానే ప్రైవేటు ఆస్పత్రి ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాస్పత్రికి వచ్చిన వారిని ఆ ఆస్పత్రికి రప్పించుకుని చికిత్సలు జరుపుతున్నారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా మంత్రులు జిల్లా అధికారులు స్థానిక ఎమ్మెల్యే చంద్రమ్మ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం రెవెన్యూ శాఖ సహాయ అధికారులకు రమేష్ మనవి పత్రం అందించారు. కార్యక్రమంలో బి మంజుల, గోపాల్ యాదవ్, షబ్బీర్, ప్రకాష్, బళ్లారి మాధవ్, మారన్న, గంగమ్మ పూజారి జగదీష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంపే...

### రామ్‌నాథ్ కోవింద్ (పుట్టినరోజు)



దేశ 14వ రాష్ట్రపతిగా 2017 నుంచి 2022 వరకు వ్యవహరించిన రామ్‌నాథ్ కోవింద్ 1945 అక్టోబరు 1న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ దేహత్ జిల్లా పరౌఖ్ గ్రామంలో జన్మించారు. రాజకీయాల్లోకి రాకముందు 16ఏళ్లపాటు న్యాయవాదిగా ఢిల్లీ హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ వ్యవహరించారు. దళిత సామాజికవర్గం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా క్రమేపీ రాష్ట్రపతిగా ఎదిగిన కేఆర్ నారాయణ్ తర్వాత రెండోనేత ఆయనే. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాల భవనాల నిర్మాణాలకు చొరవ చూపారు. కాగా ఐక్య రాజ్యసమితి సమావేశంలోనూ ప్రసంగించి తనదైన గుర్తింపు పొందారు. అధ్యక్షుడిగా ఆరు దేశాల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

### డాక్టర్ అనీబిసెంట్ (జయంతి)



బ్రిటీష్ దేశానికి చెందిన సోమ్యవాది, డాక్టర్ అనీబిసెంట్ 1847 అక్టోబరు 1న లండన్‌లో ఐరోపా సంతతికి చెందిన మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. బ్రహ్మజ్ఞానవాది, దివ్యజ్ఞాన తత్వజ్ఞి. మహిళా హక్కుల ఉద్యమవాది, రచయిత్రి. విద్యావేత్తగా బెనారస్ హిందూ యూనివర్శిటీ సంస్థాపకులలో ఒకరు. దివ్యజ్ఞాన సమాజం (థియోసాఫికల్ సొసైటీ)లో సభ్యత్వం స్వీకరించి ఉపన్యాసకురాలిగా విజయం సాధించారు. దివ్యజ్ఞాన సమాజం బాధ్యతలలో భాగంగా భారతదేశానికి వచ్చారు. 1917లో ఆమె భారతీయ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వ్యవహరించారు. 1933 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

### రఘుపతి వెంకటరత్నం నాయుడు (జయంతి)



సంఘసంస్కర్తగా పేరొందిన దివాన్ బహద్దూర్ 'సర్' రఘుపతి వెంకటరత్నం నాయుడు 1862 అక్టోబరు 1న మచిలీపట్నంలో జన్మించారు. విద్యావేత్తగానే కాక పవిత్రతకు సంకేతంగా పేరొందారు. తండ్రి మద్రాస్ ఆర్మీలో సుబేదార్‌గా ఉండడంతో హిందీ, ఉర్దూ, పర్షియన్ భాషలలో రాణించారు. 'బ్రహ్మ సమాజ్' ఏర్పాటులో ఒకరుగా నిలిచి 'బ్రహ్మర్షి'గా గుర్తింపు పొందారు. మద్రాస్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. దేవదాసీ, అస్పృశ్యత వ్యవస్థలపై పోరాడడమే కాక వితంతు వివాహాలను, బాలికా విద్యను ప్రోత్సహించారు. 1939 మే 26న కన్నుమూశారు.

### ఎస్‌డీ బర్మన్ (జయంతి)



దేశంలో పేరొందిన బాలీవుడ్ సంగీత దర్శకుడు సచిన్ దేవ్ (ఎస్‌డీ) బర్మన్ 1906 అక్టోబరు 1న అవిభాజ్య భారత దేశం బంగ్లాదేశ్‌లోని కోమిల్ల ప్రాంతంలో జన్మించారు. త్రిపుర రాజ వంశంలోని రాజకుమారుడు. గాయకుడిగా రాణించారు. ఆయన సంగీత దర్శకత్వంలో లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, గీతాదత్, మన్నాడే, కిశోర్ కుమార్, ఆశా భోంస్లే, ముకేశ్ వంటి గాయకులు ఆలపించారు. కిశోర్‌కుమార్, మహమ్మద్ రఫీతో సమానంగా పాటలు చేసిన ఏకైక దర్శకుడు సచిన్‌దేవ్ బర్మన్. జాతీయ సినిమా అవార్డు, సంగీత నాటక అకాడమీ అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. 1975 అక్టోబరు 31న కన్నుమూశారు.

### మజ్రూ సుల్తాన్‌పురి (జయంతి)



ప్రముఖ ఉర్దూ కవి మజ్రూ సుల్తాన్‌పురి 1919 అక్టోబరు 1న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్‌పూర్‌లో జన్మించారు. హిందీ సినిమాలకు పాటలు రాశారు. అసలు పేరు అస్రార్ ఉల్ హసన్‌ఖాన్. గజల్స్‌లో ఆయన పేరొందారు. ఆరు దశాబ్దాలలో అనేకమంది సంగీత దర్శకులతో కలసి పనిచేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన తొలి గేయ రచయిత. 2000 మే 24 కన్నుమూశారు.

### రమణారెడ్డి (జయంతి)



తెలుగు సినిమా హాస్యనటులలో ఒకరైన రమణారెడ్డి 1921 అక్టోబరు 1న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జగదేవి పేటలో జన్మించారు. పూర్తి పేరు తిక్కవరపు వెంకట రమణారెడ్డి. సన్నగా పొడుగ్గా ఉండే ఆయన తన హాస్యంతో ఉర్రూతలూగించాడు. ఏ పాత్ర వేసినా అందులో సగం నెల్లూరు మాండలికం ఉంటుంది. సేవాసంఘాల సహాయనిధికి ఉచిత మ్యాజిక్ ప్రదర్శనలు ఇచ్చేవారు. సినిమాలలో రాకముందు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేశారు. 1974 నవంబరు 11న కన్నుమూశారు.

### అల్లు రామలింగయ్య (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత అల్లు రామలింగయ్య 1922 అక్టోబరు 1న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ నటుడు, నిర్మాత. 1030 సినిమాల్లో కామెడీ విలనీ, క్యారెక్టర్ పాత్రలలో నటించి మూడుతరాల సినీ ప్రేక్షకులను అలరించారు. నాటకాల్లో నటిస్తూనే సామాజిక బాధ్యతతో 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నారు. జైలులో కూడా తోటివారితో నాటకాలాడారు. 2001లో రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. 2004 జూలై 30న కన్నుమూశారు. 2013లో భారత సినీ పరిశ్రమ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదలైన 50 పోస్టల్‌స్టాంపులలో ఆయన జ్ఞాపకార్థం ఒకటి ఉంది.

### శివాజీ గణేశన్ (జయంతి)



తమిళ సినీ రంగంలో నడిగర్ తిలగంగా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత శివాజీ గణేశన్ 1928 అక్టోబరు 1న తమిళనాడు రాష్ట్రం విల్లుపురంలో జన్మించారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో 'బెస్ట్ యాక్టర్' అవార్డు అందుకున్న తొలి భారతీయుడు. దాదాసాహెబ్ ఫాల్కే, కలైమామణి, పద్మశ్రీ అవార్డు, గౌరవ డాక్టరేట్లు ఇతర పురస్కారాలు అందుకున్నారు. డీఎంకే పార్టీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. 2001 జూలై 21న కన్నుమూశారు.

## ఆర్థిక సాయం అందజేత

రొళ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మల్లసముద్రం అశోక్ మృతిచెందాడు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పరామర్శించి తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు.

# గడ్డదనాయకనహళ్ళిలో వైభవంగా దుర్గాష్టమి

» అంబారీపై ఊరేగిన దుర్గా పరమేశ్వరి



హోమంలో ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్ తదితరులు



అమ్మవారికి విశేష అలంకరణ

విజయపుర, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దుర్గాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకా విజయపుర సమీపంలోని గడ్డదనాయకనహళ్ళిలో పురాతన ప్రసిద్ధమైన దుర్గా పరమేశ్వరి దేవాలయంలో దుర్గాష్టమి వేడుకలు వైభవంగా కొనసాగాయి. హావేరి సిద్ధారూఢ మఠానికి చెందిన ఏనుగుపై అంబారీని సిద్ధం చేయగా అమ్మవారు ఊరేగారు. మంగళవారం ఉదయం ఆలయంలో పలు విశేషపూజా కార్యక్రమాలు కొనసాగాయి. పుష్పాలంకరణ, వజ్రాభరణాలతో అమ్మవారిని అలంకరించారు. చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. వివిధ ఆలయాల పురోహితులు హోమంలో భాగస్వామ్యులయ్యారు. దసరా ఉత్సవాల్లో దుర్గాష్టమి రోజున అంబారీపై అమ్మవారిని ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. గణపతిపూజ, కళశారాధన, స్వస్తివాచనం, పంచగవ్య రక్షాబంధన, కళశారాధన, చండీసప్తశతి పారాయణ, గణపతిహోమం, నవగ్రహహోమం, చండికాహోమం, మహాపూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఊరేగింపులో వివిధ కళాబృందాలు సందడి చేశాయి. గ్రామదేవతల పల్లకీతో గ్రామవీధుల్లో ఊరేగింపు కొనసాగింది. ఆలయ నాగరాజప్పస్వామి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. బెంగళూరు గ్రామీణ, కోలారు, చిక్కబళ్ళాపుర, దొడ్డబళ్ళాపుర, హొసకోటె, బెంగళూరు నగర చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన లక్షలాదిమంది భక్తులు అమ్మవారిని కొలుస్తారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఎఈశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో శక్తిదేవతగా దుర్గామహేశ్వరి పూజలందుకుంటోందన్నారు. ప్రతి సంవత్సరం గడ్డదనాయకనహళ్ళి దుర్గామహేశ్వరి దసరా వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయన్నారు. వీరగాసె, డొళ్ళుకుణిత, పూజాకుణిత, కేరళ వాద్యగోష్టి వివిధ బృందాలు సందడి చేశాయి. ప్రముఖ హరికథా విద్వాన్ శీలానాయుడుచే హరికథా కార్యక్రమం సాగింది. ఉత్సవాలలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గ్రామదేవతల ఊరేగింపు



హరికథ చెబుతున్న విద్వాన్ కళాకారిణి శీలానాయుడు

## విధానసౌధలో ఆయుధపూజ

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాలనాకేంద్రమైన విధానసౌధలో మంగళవారం ఆయుధపూజ నిర్వహించారు. అన్ని శాఖల కార్యాలయాలను, మంత్రుల చాంబర్లను అరటిపిలకలు, పూలమాలలతో ముస్తాబు చేశారు. రంగవల్లులు వేశారు. వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ స్వయంగా తన కార్యాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేపీసీసీ కార్యాలయంలో డీకే శివకుమార్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న డీకే



పూజలు నిర్వహిస్తున్న హోంమంత్రి పరమేశ్వర్

బెంగళూరు రోడ్లపై గుంతలు పూడ్చలేరు..

## బిడది స్మార్ట్ సిటీ ఎలా చేస్తారు?

» సర్కారుపై రైతుల ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రోడ్లలో గుంతలు సకాలంలో పూడ్చకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయని, ప్రమాదాలు పెరిగాయని వాటిని నియంత్రించలేరుగానీ బిడది ప్రాంతంలో స్మార్ట్ సిటీ ఎలా సాధ్యం చేస్తారని ఓ రైతు విరుచుకుపడ్డారు. గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార ద్వారా బిడదిలో తొలి కృత్రిమ మేధస్సు నగరం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో పశ్చిమంవైపు ఉండే బిడది పరిధిలో 26 గ్రామాలకు అనుబంధమైన 9,600 ఎకరాలలో గ్రేటర్ బెంగళూరు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు జరుపుతోంది. డీసీఎం డీకే శివకుమార్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. బీజేపీ, జేడీఎస్ నాయకులు ప్రాజెక్టును వదిలి పెట్టాలని, రైతులకు అన్యాయం చేయరాదని కోరుతున్నారు. ఇప్పటికే రైతులు చేస్తున్న ఆందోళనకు జేడీఎస్ యువనేత నిఖిల్‌కుమార్ మద్దతు ఇచ్చారు. అవసరమైతే నేను నిరసనకు వస్తానని కేంద్రమంత్రి కుమారస్వామి ప్రకటించారు. ఉన్న భూమిలో పంటలసాగు చేసుకుని జీవనం సాగించే వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే ప్రాజెక్టు అని జేడీఎస్ మండిపడుతోంది. ఇదే విషయమై భూరక్షణాసంఘం నేత రామయ్య మంగళవారం నిరసనలో మాట్లాడుతూ బెంగళూరులో గుంతలు పూడ్చలేరు గానీ, ఇక్కడ స్మార్ట్‌సిటీ ఎలా సాధ్యం చేస్తారని ప్రశ్నించారు. చిన్నరైతులు ఇక్కడ అధికంగా ఉన్నారని ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి కల్గినవారు ఉన్నారన్నారు. ఎకరాకు కోటి లేదా కోటిన్నర చెల్లించి స్వాధీనం చేసుకుని, డెవలెపర్లకు ఐదారు కోట్లకు విక్రయించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని మండిపడ్డారు. స్మార్ట్‌సిటీ అవసరం లేదని, ఇక్కడి ప్రజల జీవనానికి భంగం కలిగించరాదన్నారు.

## సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత మహిళలదే



సమావేశంలో పాల్గొన్న శాశ్వత నీరావరి పోరాట సమితి నేత ఉషా తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అయితే పిల్లలను సంస్కారవంతులుగా తీర్చేబాధ్యత మహిళలపై ఉందని శాశ్వత నీరావరి పోరాట సమితి నేత ఉషా ఆంజనేయ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వాసవి కల్యాణమండపంలో ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తాలూకాస్థాయి చర్చాగోష్టి, సుజ్ఞానిధి స్కాలర్‌షిప్ పంపిణీలో పాల్గొని మాట్లాడారు. మహిళలు సామాజికంగా, విద్య, ఆర్థికంగా స్వావలంబన సాధిస్తేనే పురోగతి సాధ్యమన్నారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితి అనే భావన సరికాదన్నారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమా, ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


## దీక్షాభూమికి బస్సు యాత్ర

» అంబేద్కర్ ఆశయాలపై అవగాహన కోసం..

బంగారపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మారకం, బౌద్ధధర్మ పవిత్రయాత్రాకేంద్రం ఉన్న మహారాష్ట్ర నాగపూర్‌లోని దీక్షాభూమికి బస్సుయాత్ర మంగళవారం బయల్దేరింది. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యాత్ర బస్సుకు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పచ్చజెండా చూపారు. ఏటా 5వేలమందికిపైగా అంబేడ్కర్ ఫాలోయర్లను పంపుతోందని ఇందులో భాగంగా బంగారపేట తాలూకా నుంచి 38మందికి అవకాశం లభించిందన్నారు. దీక్షా కేంద్రాన్ని సందర్శించి అంబేడ్కర్ ఆశయాలు, సాధనల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం నారాయణస్వామి, పురసభ అధ్యక్షుడు గోవింద, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి, గ్రేడ్-2 తహసీల్దార్ గాయత్రి, సాంఘికసంక్షేమశాఖ అధికారి అంజలీదేవి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చింతామణి మిండిగల్ చౌడేశ్వరీదేవికి వెండికవచధారణ



కత్రిగుప్పె రాజరాజేశ్వరిదేవికి వజ్రాంగి అలంకరణ



గిరినగర్ వాసవీమాతకు నవగ్రహ అలంకరణ



చామరాజపేట వాసవీమాతకు దుర్గా అలంకరణ

## తిరుమల బ్రహ్మోత్సవాల్లో బెంగళూరు విద్యార్థుల ప్రదర్శన

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. బెంగళూరు మైసూరుబ్యాంకు సర్కిల్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. డొళ్ళుకుణిత, కంసాలె, కీలుగుర్రాలు, బంజారా, భాంగ్రా, కథాకళి వంటి ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థినులు డొళ్ళుకుణిత తిరుమలవీధులలో ప్రత్యేకం అనిపించింది. హిదాయత్ అహ్మద్ నేతృత్వంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వరుసగా తొమ్మిదిరోజుల పాటు విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చినట్టు కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి తెలిపారు.



విద్యార్థుల బృందం

## దొమ్మసంద్ర పంచాయతీలో ఆయుధపూజ

దొమ్మసంద్ర, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నవరాత్రి వేడుకలలో భాగంగా ఆయుధపూజ నిర్వహించారు. గ్రామపంచాయతీ అధ్యక్షులు నరేశ్ అధ్యక్షత వహించారు. నాడదేవత చాముండేశ్వరి దేవతకు పూజలు చేశారు. జీబీఏ పరిధిలోకి రానుండడంతో త్వరలోనే పనులు మరింత అభివృద్ధి కానున్నాయని, ఇంటి యజమానికి భూమి హక్కు పొందడంలో జాప్యం నివారిస్తామని, జలజీవన్ మిషన్ పనులు సాకారం చేస్తామని నరేశ్ తెలిపారు. ఈ-ఖాతా సమస్య పరిష్కారానికి గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జడ్పీ సీఈఓతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ట్రాక్టర్, పంచాయతీ రికార్డులు ఇతర ఉపకరణాలకు పూజలు చేశారు. ఆయుధపూజ సందర్భంగా పౌరకార్మిక సిబ్బందికి రెండుజతల బట్టలు, గౌరవధనం, పండ్లు, మిఠాయిలు అందచేసి గౌరవించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గిరిజా, అభివృద్ధి అధికారి జ్యోతి, కార్యదర్శి మంజునాథరెడ్డి, సభ్యులు ఉమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## జంబూసవారీకి సిద్ధమైన రాచనగరి

(5వపేజీ తరువాయి )లభించింది.

**కావేరి హారతి దక్షిణ పరంపర కావాలి: సుత్తూరు స్వామీజీ**

ఉత్తరభారత్‌లో గంగా హారతి తరహాలోనే దక్షిణాదిన కావేరి హారతి నిరంతరం సాగాలని తద్వారా ఉత్తర, దక్షిణభారత్‌ల పరంపర సమ్మిళితం కానుందని సుత్తూరు వీరసింహాసన మఠాధిపతి డాక్టర్ శివరాత్రి దేశికేంద్రస్వామీజీ అభిప్రాయపడ్డారు. కావేరి హారతి కార్యక్రమంలో పాల్గొన్న స్వామిజీ మాట్లాడుతూ డీసీఎం కలల ప్రాజెక్టు కావేరి హారతి విజయవంతమైందన్నారు. ఎడారిలాంటి ప్రాంతాన్ని కేఆర్ఎస్ సస్యశ్యామలంగా మార్చిందని, కావేరి హారతి ద్వారా ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. ప్రకృతిని పూజించడం మన సంస్కృతి అని, హరప్పా, మొహంజదారో కాలం నుంచి ఇది కొనసాగిందన్నారు. కావేరి హారతి ద్వారా నది అశుభ్రం కాదని, నది పవిత్రతను కాపాడే విధానమన్నారు. కార్యక్రమంలో సిద్ధలింగస్వామిజీ, ఎమ్మెల్సీ దినేశ్‌గూళిగౌడ, వివిధ మఠాలకు చెందిన 30మందికిపైగా స్వామిజీలు కావేరి హారతిలో పాల్గొన్నారు. కాగా కావేరి హారతి నిర్వహిస్తున్న తరుణంలో బృందావన్ గార్డెన్స్‌ను సందర్శించేవారికి ఉచిత ప్రవేశం అవకాశం కల్పించారు.

## అలరించిన నృత్యం



బాలికల నృత్య ప్రదర్శన

బెంగళూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో 45వ ఏట నవరాత్రి సంగీత, నృత్య కార్యక్రమాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సంగీత విద్యాంసురాలు సుష్మశ్రీధర్ శిష్యబృందం కూచిపూడి నృత్యాలు చేశారు. సుష్మశ్రీధర్ వద్ద శిక్షణలు పొందిన రష్మిత, అనన్య, అభిజ్ఞ, మోహిత, అశ్విని, మోక్షితలు నృత్య ప్రదర్శన చేశారు. పద్మావతి కళానికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ వేణుగోపాల్, అధ్యక్షులు ఏవీ శ్రీధర్ తదితరులు నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. సోమవారం ప్రారంభమైన సాంస్కృతిక ప్రదర్శనలు అక్టోబరు 2వరకు జరుగుతాయని వేణుగోపాల్ తెలిపారు.

## సౌలభ్యాల పంపిణీకి జనస్పందన వేదిక కావాలి



సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా, జనస్నేహిగా నిర్వహిస్తున్న జనస్పందన కార్యక్రమం సౌలభ్యాల పంపిణీకి వేదిక కావాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని గృహ కార్యాలయంలో మంగళవారం బిళ్ళూరు, రాశ్చెరువు గ్రామ పంచాయతీలలో జనస్పందన సన్నాహకసభ జరిగింది. బాగేపల్లి, చేళూరు తాలూకాల అధికారులు పాల్గొన్నారు. వివిధశాఖల నుంచి కనీసం 2వేలమంది లబ్ధిదారులు ప్రయోజనం పొందేలా కార్యక్రమం రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఇంకా పలురకాల పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారి సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం మిట్టేమరి, కానగమాకలపల్లి గ్రామపంచాయతీలలో జనస్పందన ఉంటుందన్నారు. సమావేశంలో బాగేపల్లి తహసీల్దార్ మనీష్ ఎన్ పత్రి, చేళూరు తహసీల్దార్ బీకే శ్వేత, తాలూకా పంచాయతీ ఈఓ జీవీ రమేశ్, బీఈఓ వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘోషా ఆసుపత్రిలో డాక్టర్ల అవినీతి

» ఇద్దరు గైనకాలజిస్టులు, సిబ్బందిపై వేటు

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శివాజీనగర్‌లోని ప్రభుత్వ హాజిసర్ ఇస్మాయిల్ సేట్ (హెచ్ఎస్ఐఎస్) ఘోషా ఆసుపత్రిలో అవినీతి బహిరంగమైంది. ఆసుపత్రిలో ప్రతిరోజూ 25-30 కాన్పులు జరుగుతాయి. రోజూ 300-400మంది రోగులు ఓపీడీకి వస్తారు. ఇక్కడ అక్రమంగా గర్భస్రావం, గర్భాశయానికి సంబంధించి ఆపరేషన్లకోసం వచ్చేవారికి ప్రైవేట్ ఆసుపత్రులకు పంపడమే కాకుండా ఇక్కడి వస్తువులను సైతం సరఫరా చేసినట్టు గుర్తించారు. అటల్ బిహారి వాజ్‌పేయ్ మెడికల్ కళాశాలలో పనిచేసే గైనకాలజిస్టులు డాక్టర్ దీపిక, రమ్యలు అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. వెంటనే వాణి విలాస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సవితా, డీడీ రాజ్‌కుమార్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. అందులో డాక్టర్లు దీపిక, రమ్యలు గర్భస్రావం చేయడంతోపాటు పలు విధాలా అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. ప్రైవేట్ ఆసుపత్రులనుంచి ఫోన్‌పే రూపంలో నగదు పొందినట్టు నిర్ధారించారు. కమిటీ వైద్యవిద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మహ్మద్ మొహిసిన్‌కు నివేదిక సమర్పించారు. ఈమేరకు ఇద్దరు వైద్యులతోపాటు పలువురు నర్సింగ్ సిబ్బందిపైనా సస్పెన్షన్ వేటు వేశారు.

## శరణ్య భరతనాట్య రంగప్రవేశం

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భరతనాట్యంలో సుదీర్ఘంగా శిక్షణలు పొందిన శరణ్య అక్టోబరు 5న రంగప్రవేశం చేయనున్నారు. విదూషి కావ్య దిలీప్, సంపూర్ణమ్మ బలరాం సహకారంతో శరణ్య భరతనాట్యం నేర్చుకున్నారు. 5న ఆదివారం మల్లేశ్వరంలోని సేవాసదన్ ఆడిటోరియంలో రంగప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు విదూషి కావ్యదిలీప్ తెలిపారు.

## విద్యతోపాటు విలువలకు ప్రాధాన్యం

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుణాత్మక విద్యతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు లిటిల్ మిలీనియం నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. బ్లూమ్ పేరిట కిండర్‌గార్టెన్ స్కూల్‌ను ప్రారంభించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అను గుణంగా కరికులమ్ ఉంటుందన్నారు. నాలెడ్జ్, సైన్స్ వాల్యూస్‌కు ప్రాధాన్యత ఇచ్చేలా బోధనలు ఉంటాయన్నారు.

# సమ్మెలోకి పీహెచ్‌సీ డాక్టర్లు

● డిమాండ్ల సాధన కోసం మూడు వరకు విధులకు దూరం
● వైద్యసేవలకు అంతరాయం లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) డాక్టర్లు మంగళ వారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈమేరకు ఏపీ ప్రాథమిక వైద్యకేంద్రాల డాక్టర్ల అసోసియేషన్(ఏపీపీహెచ్‌సీడీఏ) నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 3 వరకు విధులకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. మండల స్థాయిలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్లు 2005లో ఉద్యోగంలో చేరినా నేటికీ అదే క్యాడర్‌లో పని చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు పీహెచ్‌సీ డాక్టర్‌గా ఎనిమిదేళ్ల పనిచేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గాను, మరో ఎనిమిదేళ్ల ఉద్యోగం చేసిన డాక్టర్లకు సివిల్ సర్జన్‌గాను ఉద్యోగోన్నతలు కల్పించాలి. స్టేట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు దశాబ్దాలుగా సమస్యలు చెబుతున్నా పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### 110మంది డాక్టర్లు

జిల్లా వ్యాప్తంగా 110మంది డాక్టర్లు పీహెచ్‌సీల్లో శాశ్వత విధానంలో పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో 60 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. రెగ్యులర్ డాక్టర్లకు నిబంధనల మేరకు ప్రమోషన్లు కల్పించాలి. అయితే ప్రమోషన్లు కల్పించేందుకు ఖాళీలు లేవని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఈక్రమంలో పలువురు వైద్యులు ప్రమోషన్ లేకుండానే రిటైర్ అవుతున్నారు. మరోవైపు పీజీ కోటాలో వైద్యవిద్యను అభ్యసించేందుకు రూ.20లక్షల బాండును రాయించుకుంటున్నారు. బాండుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రభుత్వం వద్ద ఉంచుకుంటున్నారు. పీజీ పూర్తి చేసిన తరువాత విధుల్లోచేరి ఉద్యోగం చేస్తున్నా బాండు మొత్తాన్ని రూ.60లక్షలకు పెంచారని పీహెచ్‌సీ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమోషన్లు ఇవ్వాలి



ప్రమోషన్ ఇవ్వాలంటే ఖాళీలు ఉండాలని చెబుతున్నారు. డాక్టర్లకు సరిపడా డిప్యూటి సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ పోస్టులు లేవు. అందుకే మా స్థానంలోనే టైంబౌండ్ ప్రమోషన్ ఇవ్వాలి. 2005నుంచి ఇప్పటివరకు ప్రమోషన్లు లేకుండానే అనేకమంది పనిచేస్తున్నారు. ఎఫ్‌డీపీ డాక్టర్లకు పారితోషికం ఇవ్వడంలేదు. పీజీ సీట్లకోటాను పెంచడంలేదు. ఇలా అనేక సమస్యలను పరిష్కరించాలని సమ్మెలోకి వెళ్లాం.

-డాక్టర్ నారాయణస్వామి, ఏపీజీడీఏ జిల్లా అధ్యక్షుడు

### యథాతథంగా సేవలు: ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ



పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. రోజువారిగానే ప్రజలు వారి పరిధిలోని పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యసేవలు పొందవచ్చు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ పరిధిలోని 28, ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలోని 26మంది మొత్తం 54మంది డాక్టర్లను సంబంధిత పీహెచ్‌సీల్లో నియమించాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లతోపాటు పారామెడికల్ స్టాఫ్ విధుల్లో ఉంటారు. 104, 108 వాహనాల సిబ్బందిని అప్రమత్తంచేసి అందుబాటులో ఉండాలని సూచించాం. సమస్యలు ఎదురైతే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం 08554-235603 నెంబర్‌కు ఫోన్‌చేయాలని కోరాం.

### డాక్టర్లు తక్షణమే విధుల్లోకి రావాలి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధన మేరకు ప్రభుత్వ వైద్యులు సమ్మె చేయడం కుదరదని, తక్షణమే విధులకు హాజరుకావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులను ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులు మంగళవారం నుంచి సమ్మె చేస్తున్న నేపథ్యంలో వైద్య సేవలకు ఆటకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

# కమ్మకుల సంఘాల బలోపేతానికి కృషి

● సామాజికవర్గంలోని పేదలకు చేయూతనిద్దాం
● ఎవరికి ఇబ్బంది వచ్చినా.. అండగా ఉందాం
● ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కమ్మ కుల సంఘాల బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్ పిలుపునిచ్చారు. నగరంలోని రాంనగర్ కమ్మభవన్‌లో కమ్మకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురకొండ నాగన్న అధ్యక్షతన ఉమ్మడి అనంత జిల్లా కమ్మకుల సంఘాల పాలకవర్గ సభ్యుల ప్రాంతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మ కుల సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కమ్మ సామాజిక వర్గాల వారికి ఏ ఇబ్బంది వచ్చినా ఒక ర్యాపిడ్ యాక్షన్ బృందం తరహాలో అందరం కలిసి అండగా నిలబడాలన్నారు. స్తబ్దతగా ఉన్న కమ్మ సంఘాలను యాక్టివేట్ చేయాలన్నారు. వైసీపీ పాలనలో ప్రస్తుత సీఎం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగానే కాక విదేశాల్లో సైతం నిరసన కార్యక్రమాలు నిర్వహించి, మన సత్తా ప్రపంచానికి చూపించామన్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చామన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుని ఖండిస్తూ ఉద్యమించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారిని అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా చేయాల్సిన అవసం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్

### పేద పిల్లలకు చేయూత

కమ్మ సామాజిక వర్గంలో పేద కుటుంబాల్లోని పిల్లలకు హాస్టల్ వసతి కల్పించి, కళాశాలల్లో చదువుకునేలా చొరవ చూపాలన్నారు. చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న వారికి మన పెద్దలకు చెందిన సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డిగ్రీలు పూర్తి చేసి ఖాళీగా ఉన్న వారికి కెరియర్ గైడెన్స్ ప్రాజెక్టు ద్వారా సాఫ్ట్ స్కిల్స్ నేర్పించి, ఉద్యోగాలు పొందేలా సహకరించాలని సూచించారు. కార్పొరేట్ ఆస్పత్రుల సహకారంతో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి, పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడి, సామాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏపీ కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాల్లో అనేక సమావేశాలు నిర్వహించామన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో కలిపి విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అనంతరం కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా నియమితులైన బండారు మనోహర్‌నాయుడు, గరికిపాటి సుదర్శన్‌నాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు బోసుబాబు, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శులు రమేష్, వెంకటరమణ, సురేష్‌నాయుడు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, అఖిల భారత కమ్మ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగాంజనేయులు, కమ్మకుల సంఘం సీనియర్ సభ్యుడు సరిపూటి సూర్యనారాయణ, పెనుకొండ మార్కెట్‌యార్డు అధ్యక్షుడు రామకృష్ణ, తాడిపత్రి సంఘం సభ్యులు బాబు నాయుడు, హిందూపురం సంఘం గౌరవాధ్యక్షుడు నెట్టప్ప, గుంతకల్లు సంఘం అధ్యక్షుడు రామమూర్తి, పామిడి అధ్యక్షుడు బండారు రామాంజనేయులు, పుట్టపర్తి అధ్యక్షుడు కడియాల జయప్ప, ఉరవకొండ అధ్యక్షుడు దగ్గుపాటి శ్రీరామ్, గుత్తి సంఘం అధ్యక్షుడు సురేంద్రలతోపాటు ఉమ్మడి జిల్లా నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి సంఘాల నాయకులు పాల్గొన్నారు.




కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బండారు మనోహర్‌నాయుడు, గరికిపాటి సుదర్శన్‌నాయుడును సన్మానిస్తున్న నాయకులు

# ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలి

● పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్ ● డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు నిరసన

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలంటూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల వైద్యులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లో ప్రజలకు నిరంతర వైద్యసేవలు అందిస్తున్నా.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటాను పునరుద్ధరించాలనీ, టైంబౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలనీ, నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనీ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం మంజూరు చేయాలనీ, గిరిజన భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ మద్దతు పలికారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

# కొత్త టీచర్లకు 3 నుంచి శిక్షణ

● వారానికే కుదింపు.. ఆ తర్వాతే కౌన్సెలింగ్
● హాజరైనోళ్లకే ప్లేస్‌మెంట్ ఆర్డర్లు ● కమిషనర్ ఆదేశాలు
● ఏర్పాట్లలో సమగ్రశిక్ష అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు ఈనెల 3వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. నియామక పత్రాలు అందజేసే సమయంలోనే అక్టోబరు 3నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని విద్యాశాఖ కమిషనర్ షెడ్యూల్ ప్రకటించిన విషయం విదితమే. ముందే కౌన్సెలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్స్ ఇచ్చి 4 నుంచి 13 వరకు శిక్షణ ఉంటుందని మళ్లీ చర్చ సాగింది. దీనిపై కమిషనర్ విజయరామరాజు తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈనెల 3 నుంచి 10వతేదీ వరకు శిక్షణ ఉంటుందనీ, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈలెక్కన కొత్త టీచర్లకు వారంపాటే శిక్షణ ఉంటుందని స్పష్టమైంది. శిక్షణకు హాజరయ్యే కొత్త టీచర్లు డ్రస్‌కోడ్ తప్పనిసరిగా పాటించి, పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 11, 12 తేదీల్లో పాఠశాలలో ప్లేస్‌మెంట్లు కేటాయించడానికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 13వ తేదీన కొత్త టీచర్లు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ కానున్నారు. శిక్షణకు హాజరైన టీచర్లకే కౌన్సెలింగ్‌లో ప్లేస్‌మెంట్లు ఇస్తామని కమిషనర్ మెలిక పెట్టినట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. గైర్హాజరైన వారికి రాష్ట్రస్థాయిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడ హాజరైన తర్వాతే ప్లేస్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్త టీచర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

### సమగ్రశిక్ష అధికారుల తర్జనభర్జన

కొత్త టీచర్లకు శిక్షణ తరగతుల ఏర్పాట్లలో సమగ్రశిక్ష శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శిక్షణ నిర్వహణ బాధ్యతలను సమగ్రశిక్షకు అప్పగించారు. జిల్లాకు చెందిన 755 మంది టీచర్లతోపాటు కర్నూలు నుంచి 800 మంది శిక్షణకు హాజరవుతున్నారు. అందుకు రెసిడెన్షియల్ స్థాయిలో వసతులు ఉన్న కళాశాలలు, శిక్షణ కేంద్రాలను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ పరిశీలిస్తున్నారు. దీనిపై బుధవారానికి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని ఏపీసీ తెలిపారు.

### ఇద్దరు నేతలకు పదవులు



బెస్త శ్రీనివాసులు



బెస్త మనోహర్

పుట్టపర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకి చెందిన ఇదరు కూటమి నాయకులకు అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా హిందూపురం నుంచి బెస్త మనోహర్ (బీజేపీ), ధర్మవరానికి చెందిన బెస్త శ్రీనివాసులు (జనసేన)ను నియమించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

### ఫుడ్ సేఫ్టీ సలహా మండలిలో చోటు



సురేష్ కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ఫుడ్ సేఫ్టీ సలహామండలి సభ్యుడిగా పుట్టపర్తికి చెందిన సురేష్‌కుమార్, కదిరి వాసి రామిరెడ్డిని నియమించారు. వారికి మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర నియామక పత్రాలు అందజేశారు. సలహామండలికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు.

### విధుల్లోకి సెక్టోరల్స్..

అనంతపురంవిద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష నూతన సెక్టోరల్స్ విధుల్లో చేరారు. ఏఎంఓగా వేణుగోపాల్, అసిస్టెంట్ సీఎంఓగా చంద్రశేఖర్, అసిస్టెంట్ ఏఎంఓ(కన్నడ)గా నారాయణస్వామి, అలెస్కోగా రామచంద్ర, ఏఎస్‌ఓగా నరసింహారెడ్డి ఇటీవల ఎంపికయ్యారు. వారికి డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఏఎంఓగా వేణుగోపాల్, అసిస్టెంట్ సీఎంఓగా చంద్రశేఖర్, అసిస్టెంట్ ఏఎంఓ(కన్నడ)గా నారాయణస్వామి.. సమగ్రశిక్షన ఏపీసీ శైలజను కలిసి, ఉత్తర్వులు ఇచ్చి జాయిన్ అయ్యారు. అలెస్కో రామచంద్ర ఏపీసీని కలిసి వెళ్లారు.

# చిత్రజ్యోతి
SINCE 1965

## విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

## శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

## ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

## సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

## రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హాలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.




## జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.